క్లుప్తంగా

ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కీలకమైన అధికారుల పోస్టులు భర్తీ కాలేదు. ప్రధానంగా అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏవో), సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేస్తున్న అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో తమపై అదనపు పని భారం పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వారి వివరాలను ఎస్ఆర్, కార్యాలయ రికార్డుల్లో నమోదు చేసే సీనియర్ అసిస్టెంట్ ఇటీవల తిరుపతికి బదిలీ అయ్యారు. దీంతో కార్యాలయంలో పనులు ముందుకు సాగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రామసముద్రం పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీఐ రమేష్

రామసముద్రం: రామసముద్రం పోలీస్ స్టేషన్‌ను సీఐ కె.రమేష్ ఆదివారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ రమేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, రౌడీయిజం ప్రోత్సహించినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కర్నాటక సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్తిక దీపోత్సవం

పెద్దతిప్పసముద్రం: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శివాలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పట్టాభి రామయ్య తెలిపారు. ఉదయం నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణా హుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

మల్లయ్యకొండకు రెండు బస్సులు

మదనపల్లె సిటీ: కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండకు రెండు ప్రత్యేక బస్సులు నడుపుతునున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరె వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం ఐదు గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. అక్కడి నుంచి రాగిమానుసర్కిల్ నుంచి సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు తిరుగుతాయన్నారు.

కాట్వా అధ్యక్షుడిగా పోతంశెట్టి సుధాకర్



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పీలేరురూరల్: ఆంధ్ర ప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కాట్వా) పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పోతంశెట్టి సుధాకర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మెయిన్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కాట్వ నియోజకవర్గ నూతన కమిటీ ఎంపిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా పసల సుధాకర్, గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పోతంశెట్టి రమేష్, చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షుడు పోకల తాతయ్య పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ అధ్యక్షుడిగా ఎం.ఎన్.రావు



ఎం.ఎన్ రావు

రాయచోటి అర్బన్: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఎన్.రావు ఎన్నికయ్యారు. ఇటీవల మదనపల్లెలో జరిగిన ఎన్ఎంయూఏ అన్నమయ్య రీజియన్ సమావేశంలో అధ్యక్షుడుతో పాటు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.ఎన్ రావు, ఉపాధ్యక్షుడిగా టి.రామాంజులు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ఎస్. ప్రసాద్, పి.వి.నరసయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.ఆర్.బి. నాయక్, ప్రచార కార్యదర్శిగా ఎస్.ఏ.ఎం.బాషాను ఎన్నికయ్యారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిన్నమండెం : తన భర్త కనిపించడం లేదంటూ ఓ వివాహిత పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. మొడెం చౌడయ్య, మొడెం కుమారి భార్యాభర్తలు. మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొడిదెపల్లికు చెందిన మొడం చౌడయ్య (44) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇండ్ల లోనూ వెతికినా ఆచూకి తెలియక పోవడంతో కుమారి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేంద్రాల మూత.. విద్యార్థులకు వెత

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ కష్టాలు తప్పడం లేదు. అపార్ ఐడీ కార్డులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వారికి సమస్యలు వచ్చి పడ్డాయి. వేలిముద్ర అప్‌డేట్, పుట్టిన తేదీ, పేరులో తప్పులు ఇలా సమస్యలు చూపుతూ ఉపాధ్యాయులు పిల్లలను ఇళ్లకు పంపుతున్నారు. అప్‌డేట్ చేసుకునేందుకు వారి తల్లిదండ్రులతో కలిసి ఆధార్ కేంద్రాలకు బారులు తీరుతున్నారు.

- మార్పుల కోసం ఆధార్ కేంద్రాలకు బారులు తీరిన విద్యార్థులు
- పెద్దమండ్యంలో మూతబడిన కేంద్రాలు



కాట్నగల్లు ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థుల నిరీక్షణ



ఐరిష్ పనిచేయక మూతబడిన ఆధార్ కేంద్రం

పెద్దమండ్యం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 3320 మంది విద్యార్థులు ఉన్నారు. పేర్లలో తప్పులు, పుట్టిన తేదీలో మార్పులు, వేలిముద్ర అప్‌డేట్ కాని విద్యార్థులు 625 మంది ఉన్నట్లు ప్రధానోపాధ్యాయులు గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆధార్ కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో అప్‌డేట్ చేయించుకోలేకపోతున్నారు. పెద్దమండ్యం, కలిచెర్ల గ్రామ సచివాలయాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసి డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. అయితే క్రమేణా ఈ కేంద్రాలలో ఐరిష్ పనిచేయకపోవడం, కంప్యూటర్ సర్వర్ రాకపోవడంతో మూతబడ్డాయి.

ఆధార్ అప్‌డేట్ జరగడం లేదు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. పెద్దమండ్యంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో గుర్రంకొండ పోస్టాఫీసుకు వెళ్తున్నాం. అక్కడికి వెళ్లేసరికి ఆ ప్రాంతంలోని విద్యార్థులు ముందుగానే క్యూ కడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ కాలేదు.

– అహ్మద్, విద్యార్థి తండ్రి, పెద్దమండ్యం

నాలుగు రోజులుగా తిరుగుతున్నా



నాగార్జున సాగర్‌లోని గురుకుల పాఠశాలలో నా కుమారుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. ఆధార్‌లో ఒక లెటర్ మాత్రమే తప్పు ఉండడంతో కరెక్షన్ చేయించుకునేందుకు వచ్చాను. గాలివీడు పోస్టాఫీసుకు నాలుగు రోజులుగా తిరుగుతున్నా సమస్య పరిష్కరించలేదు.

– ఎం ప్రవీణ్, విద్యార్థి, బీక్కావాండ్లపల్లె

కలిచెర్లలోని ఓ ప్రైవేటు ఆధార్ కేంద్రంలో కొన్ని మార్పులు చేసుకునేందుకు వీలు లేదు. పెద్దమండ్యం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో సేవలు నిలిపివేశారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి గాలివీడు, గుర్రంకొండ, మదనపల్లె ప్రాంతాల కేంద్రాలకు బారులు తీరుతున్నారు. అధికారులు పెద్దమండ్యం ఆధార్ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెద్దతిప్పసముద్రంలోనూ ఇదే పరిస్థితి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు, పీటీఎం, తుమ్మరకుంట గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినా సాంకేతిక లోపాలతో సక్రమంగా పనిచేయడం లేదు. తుమ్మరకుంటలో డిజిటల్ అసిస్టెంట్ లేక ఆధార్ సేవలు నిలిచిపోయాయి. విద్యార్థులు కాట్నగల్లు సచివాలయం వద్ద బారులు తీరుతున్నారు. మరింత మంది బి.కొత్తకోట, సత్యసాయి జిల్లా తనకల్లుకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలో మూడు ఆధార్ కేంద్రాలున్నా.. కంప్యూటర్లు మరమత్తులకు గురవడం, విడి భాగాలు అవసరమై నిలిచిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలేదు. పిల్లల తల్లిదండ్రులు ఇతర ప్రాంతాల ఆధార్ కేంద్రాలు, తహసీల్దారు కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈవోఆర్డీ యోగానంద్ వివరణ ఇస్తూ.. పీటీఎంలో సాంకేతిక లోపం ఏర్పడిందన్నారు. తుమ్మరకుంటలో డిజిటల్ అసిస్టెంట్ లేనందున సదరు ఆధార్ కేంద్రాన్ని బూర్లపల్లికి బదలాయించామని తెలిపారు.

ఎంపీహెచ్ఏల బోగస్ సర్టిఫికెట్లు ఏరివేయండి



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ అనుమతులు లేని శిక్షణ సంస్థల పేరుతో చెలామణిలో ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్)ల బోగస్ సర్టిఫికెట్లను నిషేధించి వెంటనే ఏరివేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ శిక్షణ సంస్థల్లో శిక్షణ తీసుకొని.. సర్టిఫికెట్లు ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. దీనిపై విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయనకోరారు. స్పందించిన మంత్రులు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు.

50 ఏళ్ల తర్వాత..కలిసిన స్నేహ బంధం



50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: 50 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిర పడిన స్నేహితులు ఓ చోట చేరి ముచ్చటించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని మురిసిపోయారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1973–74 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ సమావేశం ఆదివారం పాఠశాలలోనే ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అంతా కలిసి పది బెంచీలను పాఠశాలకు వితరణ చేశారు. రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అశోక్ రెడ్డి, నారాయణస్వామి, వాసు, మురళి, విజయలక్ష్మి, గిరి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై.. భక్తుల సందడి



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మ తల్లీ.. చల్లంగా చూడు అంటూ భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామునే నైవేద్యం సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దిగువ తొట్లివారిపల్లెలో అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరు తాగి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతో అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర, సారె, పూజా సామగ్రి సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. భక్తులు దాతలు అన్నదానం చేశారు.

పీలేరులో మాజీ ఎమ్మెల్యే పర్యటన



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు: స్థానిక టీడీపీ కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు కంభం వెంకటరమణారెడ్డి కుమారుడు పవన్ కుమార్‌రెడ్డి వివాహానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో యర్రదొడ్డి నాగిరెడ్డి కుమార్తె హర్షిత వివాహానికి హాజరయ్యారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు డాక్టర్ వెంకటరామయ్య, ఒంటిల్లుకు చెందిన సుబ్బానాయుడు, చంద్రబాబులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హబీబ్ బాషా, నల్లారి తిమ్మారెడ్డి, రమేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, విజయశేఖర్ రెడ్డి, చక్రధర్, షాకీర్, ఆనంద్, లోకనాథరెడ్డి, అబీద్, మునీర్, జుమేద్, జునేల్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితేనే విజయం సాధ్యం



మాట్లాడుతున్న మహమ్మద్ హాషీం

రాయచోటి అర్బన్: పట్టుదలతో చదివితే విజయాలు సొంతమవుతాయని అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా కార్యదర్శి మహమ్మద్ హాషీం అన్నారు. అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ జెడ్పీ ఉర్దూ హైస్కూల్స్ విద్యార్థులకు విద్యారంగానికి మౌలానా ఆజాద్ చేసిన సేవలు, ఇంటర్ విద్యార్థులకు ఇక్బాల్ యొక్క దేశభక్తి అనే అంశంలపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వలన ప్రముఖుల జీవిత చరిత్రలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. పోటీల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలోని ఉర్దూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నవంబరు 9,10 తేదీల్లో కడప నాగరాజుపేటలోని మహిళాడిగ్రీ కళాశాలలో జరుగనున్న ఉర్దూ జాతీయస్థాయి సెమినార్‌లో బహుమతులను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో రూటా నేతలు సిబాతుర్ రహిమాన్, మున్వర్‌బాషా, అసదుల్లాబాషా, ఖదీర్‌పర్వేజ్, జాకీర్ అహమ్మద్, సికిందర్‌బాషా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని మద్దిరేవుల బిల్డింగ్ హరిజనవాడలో ఆదివారం దేవళంపల్లె వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మంచం పట్టిన పల్లెలు అనే శీర్షిక సాక్షిలో కథనం రావడంతో ఆదివారం కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు బిల్డింగ్ ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవళంపల్లి పీహెచ్‌సీ సీఈఓ దీప్తి మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏ రోజు నీరు ఆరోజే వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవలంపల్లె వైద్య సిబ్బంది, సచివాలయం ఏఎన్ఎం విజయ కుమారి, ఆశా కార్యకర్త కళావతి, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సుండుపల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవతా సంస్థ సభ్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్లు బీఎస్ ప్రభు, రేష్మారెడ్డి, రవికృష్ణ, మానవతా సంస్థ సభ్యులు గంగిరెడ్డి, మహబూబ్ బాషా, హరికుమార్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దేవళంపల్లి వైద్య సిబ్బంది

బహుజనుల సత్తా చాటాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతంకుమార్

రాయచోటి అర్బన్: బహుజనులంతా ఐక్యమై రాజ్యాధికారాన్ని దక్కించుకునేందుకు సత్తాను చాటాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో బీఎస్పీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజనులంతా ఐక్యమై రాజకీయంగా బలపడాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి నాయకులంతా కృషి చేయాలని కోరారు.

జిల్లా నూతనకమిటీ ఎంపిక

అన్నమయ్య జిల్లా బీఎస్పీ నూతన కమిటీని గౌతం కుమార్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా అబ్బవరం యుగంధర్, కార్యదర్శిగా మహేష్‌బాబు, కోశాధికారిగా గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటర గా శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటు తర్వాత జిల్లాకమిటీని పూర్తి స్థాయిలో విస్తరించనున్నట్లు గౌతం కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా వన విహారం



మాట్లాడుతున్న ఓంప్రకాష్



అమ్మవారి పూజల్లో ఆర్య వైశ్య ప్రతినిధులు

మదనపల్లె సిటీ: కార్తీక మాసం సందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక బోయకొండ రోడ్డులో వన విహార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. మామిడి తోటలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ముందుగా అమ్మవారికి పూజలు, హోమాలు నిర్వహించి ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం పిల్లలు, యువకులు ఆట, పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా మదనపల్లె నుంచి ప్రత్యేక బస్సులు, వాహనాల్లో ఆర్యవైశ్యులు తరలివచ్చారు. సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓం ప్రకాష్ మాట్లాడుతూ ఏటా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన విహార యాత్ర జరుగుతుందన్నారు. అందరూ కలసికట్టుగా మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిధర్, క్రిష్ణమూర్తి, దేవతా సతీష్, బాలాజీ, ప్రవీణ్‌కుమార్, రవీంద్రనాథ్ , అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చెట్ల తొలగింపు



పొక్లెయిన్‌తో చెట్లు తొలగిస్తున్న సిబ్బంది

మదనపల్లె: పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. సీటీఎం రోడ్డులో ఆదివారం సాయంత్రం చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనాలను దారి మళ్లించారు. పట్టణంలోని చిత్తూరు బస్టాండు, టౌన్‌బ్యాంకు సర్కిల్, సీటీఎం రోడ్డు, బెంగళూరు బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్, అనిబిసెంట్ సర్కిల్ ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు మొదలయ్యాయి. కొన్ని సార్లు జనాన్ని నియంత్రించడం పోలీసులకు సాధ్యం కావడం లేదు. ఇటీవల కలెక్టర్ చామకూరి శ్రీధర్ మదనపల్లె పట్టణంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ట్రాఫిక్ సమస్యపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సూచనలు చేశారు. టౌన్‌బ్యాంకు సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సీటీఎం రోడ్డు మీదుగా ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు చెట్ల తొలగింపుతో కార్యక్రమం ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి యంత్రాలు, కూలీలను రప్పించి పనులు చేపట్టగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కమిషన్ ప్రమీల, తహసీల్దారు ఖాజాబీ, ట్రాన్స్‌కో ఈఈ గంగాధరం, ఏడీఈ హరి, సీఐలు చాంద్‌బాషా, రామచంద్ర పర్యవేక్షించారు. మూడు రోజుల పాటు పనులు కొనసాగుతాయని, ట్రాఫిక్ నియంత్రణకు వాహనాలను దారి మళ్లించడం జరిగిందని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూఎస్ నాయకులు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి ఏపీయూఎస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) అన్నమయ్య జిల్లా నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రులు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి దివాకర్, జిల్లా అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, కె.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని కొండపై వెలసిన శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. కార్తీక మాసం కావడంతో ఆదివారం స్వామి ఆలయానికి ఎదురుగా హోమం నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి అఖండ దీపం వెలిగించారు. ఈ దీపం కార్తీక మాసం పూర్తయ్యే వరకు ఈ అఖండ దీపం వెలిగుతూనే ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

● వాహనాల వేగం.. రహదారిలో ప్రమాదం



బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. స్థానిక బసినికొండ సర్కిల్ నుంచి అమ్మచెరువుమిట్ట వరకు ఇటీవల కొత్తగా రోడ్డు వేశారు. స్థానిక జహా చేనేతనగర్ వద్ద ఈ ప్రాంత వాసులు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో వాహనాలు వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఓ వృద్ధుడు మనుమరాలిని ట్యూషన్‌కు తీసుకుపోతుండగా బొలెరో వాహనం ఢీకొని గాయపడ్డారు. రాత్రి వేళల్లో లైట్లు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. – మదనపల్లె సిటీ

ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండు కిటకిట



కిటలాడుతున్న మదనపల్లె బస్టాండు

మదనపల్లె సిటీ: వరుస సెలవులు రావడంతో స్థానిక బెంగుళూరు బస్టాండు ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. మదనపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన జనం బెంగళూరు వెళ్లేందుకు తరలి వచ్చారు. బస్సుల్లో సీట్ల కోసం ఎగబడ్డారు. కొందరు బస్సు టాపుపై ఎక్కి ప్రయాణం చేశారు. వీక్ ఎండ్ రోజుల్లో ఆర్టీసీ బస్సులు బెంగళూరుకు అదనంగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● మార్కెట్ యార్డు ప్రహరీ కూలుతోంది?



మార్కెట్ యార్డు చుట్టూ ఏడేళ్ల క్రితం ప్రహరీ నిర్మించారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న యార్డు గోడ ప్రస్తుతం ఓ వైపునకు కుంగింది. గతంలో కురిసిన వర్షాలకు తడిచిపోయి మూడు చోట్ల పది మీటర్ల మేర కూలిపోయింది. ఇప్పటివరకు వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో మిగిలిన గోడ కూలేందుకు అవకాశం ఉంది. అధికారులు స్పందించి గోడ నిర్మించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

–గుర్రంకొండ